## బీఆర్‌ఎస్‌కు ప్రజలు అండగా ఉండాలి

**ఇండ్లస్థలాల పట్టాలు పంపిణీలో మంత్రి సబితా ఇంద్రారెడ్డి**



ఇండ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేస్తున్న మంత్రి సబితా ఇంద్రారెడ్డి, కౌన్సిలర్ తేజస్విని శ్రీకాంత్‌గౌడ్

బడంగ్‌పేట, అక్టోబర్ 3 : మంచి చేస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ప్రజలు అండగా ఉండాలని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని మంఖాల్‌లో ఇండ్ల స్థలాల పట్టాను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం 111 స్థలాల్లో జీహెచ్‌ఎంసీ నిధులతో డబుల్‌బెడ్రూమ్ ఇండ్లు నిర్మించారన్నారు. వాటిలో స్థానిక కోటా 10 శాతం మాత్రమే ఉండటంతో సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి ఇండ్లస్థలాలు 60 గజాలు కాకుండా 75 గజాలు ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చారన్నారు. పేద ప్రజలందరికీ న్యాయం చేయాలని పట్టాలు అందిస్తున్నామన్నారు. మంఖాల్‌లో అర్హులైన వారందరికీ ఇండ్ల స్థలాలు ఇస్తామని, 150 మందికి ఇచ్చామన్నారు. ఇంకా ఎవరైనా అర్హులు ఉంటే వార్డు కార్యాలయంలో దరాఖాస్తు చేసుకోవాలన్నారు. ఫాక్స్ కాన్ కంపెనీ ఏర్పాటుతో లక్ష ఉద్యోగాలు వస్తాయన్నారు. మహేశ్వరం మండలంలో ఇప్పటి వరకు 4500 ఇండ్ల పట్టాలు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక 7వ వార్డు కౌన్సిలర్ తేజస్విని శ్రీకాంత్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## కారు గుర్తుకు ఓటెయ్యాలె.. కేసీఆర్ సారే మళ్లీరావాలె

**హాజరైన డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్**



తెలంగాణ ధూం ధాంను తిలకిస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ తదితరులు

సికింద్రాబాద్, అక్టోబర్ 3 : కారు గుర్తుకు ఓటెయ్యాలె.. కేసీఆర్ సారే మళ్లీ రావాలె అని కళాకారుల ఆలపించిన పాటలు సీతాఫల్‌మండి చౌరస్తాలో మార్మోగాయి. సీతాఫల్‌మండి చౌరస్తాలో మంగళవారం రాత్రి తెలంగాణ ధూం ధాం కార్యక్రమం బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు గరికపాటి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్‌తో పాటు ఆయన కుమారులు కిశోర్‌గౌడ్, త్రినేత్ర గౌడ్ హాజరయ్యారు. తెలంగాణ వచ్చాక నిర్వహించిన ధూంధాం కావడం, తెలంగాణ ఉద్యమం, అమరుల త్యాగాలు, తెలంగాణ అభివృద్ధి, ముఖ్యమంత్రిగా కేసీఆర్ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, సికింద్రాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా తీగుల్ల పద్మారావుగౌడ్ చేసిన అభివృద్ధి పనులను కనకరాజు కళా బృందం చూపరులకు కండ్లకు కట్టినట్లుగా ఆట పాటలతో చేసి చూపించారు. తెలంగాణ ధూం ధాం కార్యక్రమం చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నది. ఈ కార్యక్రమంలో సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ సామల హేమ, నాయకులు మల్లూరి అనిల్, తోబుల విష్ణు, మహాత్మా, కిరణ్, మంద జగన్, చింతకింది మల్లేశ్, లక్ష్మి, మణిమంజరి, కనకట్ల అరుణ, విజయ, నవీన్‌గౌడ్, నవీన్‌చారి, రవి, ఓయూరాజు, సరోజ, ఎర్రజ్యోతితో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాజకీయాల్లోకి.. అక్బరుద్దీన్ కుమార్తె

సిటీబ్యూరో, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ): ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఎంఐఎం పార్టీలో యువ నేతలు తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఎమ్మెల్యే అక్బరుద్దీన్ రాష్ట్ర రాజకీయాల్లో కీలకంగా ఉండగా, ఎంపీగా ఉన్న అసదుద్దీన్ ఒవైసీ రాష్ట్ర, జాతీయ రాజకీయాల్లో కీలకంగా మారారు. ఇప్పటికే అక్బరుద్దీన్ కుమారుడు చురుగ్గా పార్టీలో పనిచేస్తున్నారు. తాజాగా తన కూతురు ఫాతిమా ఒవైసీ కూడా ప్రజాక్షేత్రంలోకి వస్తున్నట్లు ఎంఐఎం నాయకుడు, ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ప్రకటించారు. ప్రస్తుతం తన కూతురు ఫాతిమా ఒవైసీ విదేశాల్లో బారిస్టర్ చదువుతున్నదని, చదువు పూర్తి కాగానే రాజకీయాల్లోకి వస్తారని పేర్కొన్నారు. అయితే అక్బర్ కూతురు ఈ దఫా ఎమ్మెల్యేగా పోటీ చేస్తారా..? నామినేటెడ్ పదవి ఏదైనా ఇస్తారా..? అనేది ఆసక్తిగా మారింది. పాతబస్తీలో బలమైన ఓటు బ్యాంకు కలిగిన ఎంఐఎం నుంచి ఓ మహిళగా బరిలోకి దించే ఆలోచన చేస్తున్నట్లుగా తెలుస్తున్నది.

# కాంగ్రెస్ మాయ మాటలు నమ్మొద్దు

**మంత్రి చామకూర మల్లారెడ్డి ● ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో రూ.2.17 కోట్ల పనులకు శంకుస్థాపన**



ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి మల్లారెడ్డి, చైర్‌పర్సన్ ముల్లి పావనీ జంగయ్య యాదవ్

ఘట్‌కేసర్, అక్టోబర్ 3 : వచ్చే ఎన్నికల్లో ప్రజలను మోసం చేసి ఓట్లు దండుకోవడానికి కాంగ్రెస్ నాయకులు వస్తున్నారని, వారు చెప్పే మాయమాటలు ఎవరూ నమ్మొద్దని కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి ప్రజలను కోరారు. మంగళవారం ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో రూ.2కోట్ల 17లక్షలతో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనులకు చైర్‌పర్సన్ ముల్లి పావనీ జంగయ్య యాదవ్‌తో కలిసి మంత్రి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఇన్ని రోజులు కన్పించని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎన్నికలు వస్తుండటంతో వారికి ఇప్పుడు ప్రజలు గుర్తుకొస్తున్నారన్నారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. కమిషనర్ ఎండీ సాబేర్ అలీ, పోచారం చైర్మన్ బి.కొండల్‌రెడ్డి, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



### అభివృద్ధిలో మనదే అగ్రస్థానం : మంత్రి మల్లారెడ్డి

అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో కొనసాగుతుందని, సీఎం కేసీఆర్ నాయకత్వంలో దినదినాభివృద్ధి చెందుతున్నారని మంత్రి మల్లారెడ్డి అన్నారు. స్వరాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలోనే ప్రగతిలో దూసుకెళ్తుందని చెప్పారు. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి పలు డివిజన్లలో మంగళవారం రూ.4.79 కోట్లతో పలు అభివృద్ధి పనులకు మేయర్ జక్క వెంకట్‌రెడ్డి, పార్టీ అధ్యక్షుడు, గ్రంథాలయ చైర్మన్ దర్గదయాకర్‌రెడ్డిలతో కలిసి ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పలు డివిజన్లలో మంత్రికి ఘన స్వాగతం పలికారు. – పీర్జాదిగూడ, అక్టోబర్ 3



### సీఎం కేసీఆర్ కృషితోనే రాష్ట్రాభివృద్ధి

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం అనంతరం సీఎం కేసీఆర్ చేసిన కృషితో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధిలో దూసుకుపోతున్నదని కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపల్ పరిధిలోని మైసమ్మగూడలో రూ.2.20 కోట్లతో చేపడుతున్న సీసీ రోడ్లు, అంతర్గత మురికి కాలువలు, ఆర్‌సీసీ పైప్‌లైన్ నిర్మాణ పనులతోపాటు పలు అభివృద్ధి పనులకు మంగళవారం మంత్రి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ ప్రభాకర్, కమిషనర్ రాములు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు. – మేడ్చల్ రూరల్, అక్టోబర్ 3

# అండగా ఉంటా ఆశీర్వదించండి

**బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి లాస్యనందిత**



పాదయాత్రలో భాగంగా 4వ వార్డు రాంనగర్ ముదిరాజ్ బస్తీలో బీఆర్‌ఎస్ అభ్యర్థి లాస్యనందితను దీవిస్తున్న ఓ వృద్ధురాలు

కంటోన్మెంట్, అక్టోబర్ 3 : 'నేను మీ సేవకురాలిని.. మేలు చేయడానికే ముఖ్యమంత్రి కేసీఆర్ అభ్యర్థిగా, దివంగత ఎమ్మెల్యే సాయన్న కూతురిగా, నియోజకవర్గం ఆడబిడ్డగా వచ్చా.. సంపూర్ణ మద్దతు తెలిపి ఆశీర్వదిస్తారని ఆశిస్తున్నా..' అని సికింద్రాబాద్ కంటోన్మెంట్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి లాస్యనందిత అన్నారు. మంగళవారం బోర్డు పరిధిలోని రసూల్‌పురా ప్రాంతంలో లాస్యనందిత పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెకు బీసీ సంఘాలన్ని సంపూర్ణ మద్దతు తెలిపాయి. అదేవిధంగా రెండవ వార్డు పరిధిలోని రసూల్‌పురా నాయీబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు లాస్యనందితకు జై కొట్టారు. ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకే ఓటేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా లాస్యనందితను సన్మానించి, తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. బీసీ బంధుతో కులవృత్తుల వారికి అండగా నిలుస్తున్న కేసీఆర్ సర్కారు వెన్నంటి ఉంటామని నాయీబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా లాస్యనందిత మాట్లాడుతూ.. కేసీఆర్ మరోసారి ముఖ్యమంత్రి అవుతారని, హ్యాట్రిక్ సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. తనను కూడా వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజార్టీతో ఆశీర్వదించాలని కోరారు. నియోజకవర్గ అభివృద్ధితో పాటు ప్రజలకు సేవలందించేందుకే సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ గుర్తించి ఎమ్మెల్యే టికెట్ కేటాయించారన్నారు. అందరూ సహకరిస్తే అభివృద్ధి సాధ్యమని, నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు తలదించుకునే పరిస్థితి రానివ్వకుండా పని చేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో కేసీఆర్ మరోసారి ముఖ్యమంత్రి అవుతారని, హ్యాట్రిక్ సాధిస్తారని అన్నారు.

### ఇంటింటికి తిరుగుతూ సంక్షేమాన్ని వివరిస్తూ..

'సమస్యలు తెలిసిన తనను, కారు గుర్తుకు ఓటేసి ఆశీర్వదించండి..అండగా ఉంటా..' అని బీఆర్‌ఎస్ పార్టీ కంటోన్మెంట్ నియోజకవర్గ అభ్యర్థి లాస్యనందిత ప్రజలను కోరారు. అంతకుముందు నాలుగో వార్డులోని పలు ప్రాంతాల్లో పాదయాత్ర చేపట్టారు. ప్రతి బస్తీలో ప్రజలు, కార్యకర్తలు ఆమెకు ఘనస్వాగతం పలికారు. బస్తీల్లోని ప్రధాన వీధుల్లో కాలినడకన తిరుగుతూ ప్రచారం చేశారు. ప్రచారంలో భాగంగా రాంనగర్ ముదిరాజ్ బస్తీలో ఓ వృద్ధురాలు లాస్యనందితను పట్టుకుని మీ తండ్రి లాగే మీరు ప్రజలకు సేవ చేయాలని, తమ ఆశీర్వాదం ఎల్లప్పుటూ ఉంటుందని దీవించింది. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మహిళా నాయకురాలు నివేదిత, సీనియర్ నాయకులు టీఎన్ శ్రీనివాస్, కుమార్ ముదిరాజ్, నరేశ్, శ్యాంరెడ్డి, నర్సింహ, ఆంజనేయులు, మహేశ్, పాండు నాయక్, సురేశ్, ప్రవీణ్, గౌస్, ఉస్మాన్, రవూఫ్, నాయీబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

### బీఆర్‌ఎస్ ప్రభుత్వంతోనే కంటోన్మెంట్ అభివృద్ధి

**ఇంటింటి ప్రచారంలో అభ్యర్థి జి.లాస్యనందిత**

మారేడ్‌పల్లి, అక్టోబర్ 3 : బీఆర్‌ఎస్ ప్రభుత్వంతోనే కంటోన్మెంట్ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని కంటోన్మెంట్ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి జి.లాస్యనందిత అన్నారు. మంగళవారం కంటోన్మెంట్ 4వ వార్డులోని రాంనగర్, ముదిరాజ్ బస్తీ, యాదవ బస్తీ తదితర ప్రాంతాల్లో స్థానిక మాజీ బోర్డు సభ్యురాలు నళిని కిరణ్, బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి జి.లాస్యనందిత ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజలకు వివరిస్తూ.. ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా లాస్యనందిత మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలతో అందరికీ చేరువైన బీఆర్‌ఎస్‌ను మరోసారి ఆశీర్వదించి, కారు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలన్నారు. కంటోన్మెంట్‌లోని ప్రతి ఇంటికీ దివంగత ఎమ్మెల్యే సాయన్న లాగే తను కూడా ప్రజాసేవ చేస్తానని, తనకు ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో బోర్డు మాజీ సభ్యురాలు నళిని కిరణ్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు టీఎన్.శ్రీనివాస్, నివేదిత, శ్రీకాంత్, వినోద్, సదానంద్, గజ్జెల గోపాల్, మహేశ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.